సాక్షి సూర్యాపేట

గురువారం । 9 । నవంబర్ । 2023



లగ్గానికి 'కోడ్' పగ్గం!
ఎన్నికల కోడ్ శుభకార్యాలు చేసే వారికి కష్టాలను తెచ్చి పెట్టింది. దీని ప్రభావం ప్రధానంగా పెళ్లిళ్లపై పడింది. - IIలో



పోలింగ్ ప్రక్రియలో మార్పులు
ఈ సారి పోలింగ్ ప్రక్రియలో స్వల్ప మార్పులు చేశారు. ఆ మార్పులను ఓటర్లు తప్పకుండా తెలుసుకోవాలి. - IIలో



కారు పోయి చేయి వచ్చే..
నేతలు పార్టీలు మారుతుండడంతో కార్యకర్తలు సైతం తమ వాట్సాప్ గ్రూప్‌ల్లో ప్రచారం శైలి మారుస్తున్నారు. - IIలో

విద్యతోనే దేశాభివృద్ధి

- విద్యార్థులకు లక్ష్యం ఉండాలి
- రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- ఘనంగా ఎంజీ యూనివర్సిటీ మూడో స్నాతకోత్సవం
- విద్యార్థులకు డాక్టరేట్లు, గోల్డ్‌మెడల్స్ అందజేసిన గవర్నర్
- కుటుంబ సభ్యులతో కలిసి తరలివచ్చిన పట్టభద్రులు



ఎంజీ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, చిత్రంలో వైస్‌చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ రామచంద్రం తదితరులు

ఎంజీయూ(నల్లగొండరూరల్): విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. బుధవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన ఎంజీయూ 3వ స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థులు దేశ, విదేశాల్లో రాణిస్తున్నారని కితాబునిచ్చారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ మరింత పురోభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సంస్కృతి, సంప్రదాయాలకు నల్లగొండ జిల్లా పేరుగాంచిందని కొనియాడుతూ జిల్లా చరిత్రను ఉద్ఘాటించారు. విద్యార్థులకు లక్ష్యం ఉండాలని.. ఆ లక్ష్య సాధనకు ప్రత్యేక ప్రణాళిక ఉండాలన్నారు. సమయం దొరికినప్పుడు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంట్లో ఉంటే పుస్తకాలు చదవాలన్నారు. ఫలితంగా ఎంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. తాను ఖాళీ సమయంలో, ఏదైనా ఇబ్బందిగా ఉన్నప్పుడు గంటసేపు పుస్తకం చదివి శక్తి, ఉల్లాసం పెంచుకుంటానని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో వెల్లివిరిసిన ఆనందం

కరోనా అనంతరం ఎంజీ యూనివర్సిటీలో నిర్వహించిన ఈ స్నాతకోత్సవానికి విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి డాక్టరేట్లును, గోల్డ్ మెడల్స్‌ను అందుకున్నారు. గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ అందుకోవడంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రుల్లో ఆనందం వెల్లివిరిసింది. గవర్నర్ పాల్గొన్న ఈ స్నాతకోత్సవంలో డాక్టరేట్లు, గోల్డ్ మెడల్స్ అందుకున్న వారి జీవితంలో ఒక మధురమైన ఘట్టంగా నిలిచింది. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్స్ పొందిన పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదువుతూ రెగ్యులర్‌గా తరగతులకు హాజరు కావడం వల్లే చదివి ఉత్తమ ప్రతిభ చాటామని కొందరు విద్యార్థులు చెప్పుకొచ్చారు. పీహెచ్‌డీ చేయాలనే ముందస్తు ప్రణాళికతోనే లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగుతున్నామని మరికొందరు తమ అభిప్రాయాలు వెలి బుచ్చారు. పట్టాలు అందుకున్న అభ్యర్థులంతా కొందరు హైదరాబాద్‌లో ఐఐసీటీలో పీహెచ్‌డీ చేస్తుండగా మరికొందరు ప్రైవేట్ రంగంలో స్థిరపడగా కొంత మంది ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర వుతున్నారు.



బయో టెక్నాలజీలో పరిశోధనకు పెండ్యాల సరితకు డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్

గవర్నర్‌కు ఘనస్వాగతం

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఘన స్వాగతం లభించింది. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అధ్యాపకులతో పరిచయం చేసుకుని వారితో కొద్దిసేపు మాట్లాడారు. పాలక మండలి సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం స్నాతకోత్సవ సభా స్థలానికి చేరుకున్నారు. యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి ఈ సందర్భంగా ఎంజీయూ అభివృద్ధితోపాటు విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను వివరించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం కృషి చేస్తున్నట్లు గవర్నర్‌కు ఆయన తెలిపారు.



ఓయూ మాజీ వీసీ రామచంద్రంను సన్మానిస్తున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి



స్నాతకోత్సవానికి హాజరైన ప్రముఖులు, పీహెచ్‌డీ పట్టభద్రులు

నామినేషన్లు రేపే ఆఖరు

- నేడు ఏకాదశి కావడంతో అత్యధికంగా దాఖలయ్యే అవకాశం
- ముహూర్తం ఖరారు చేసుకున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఉత్తమ్, ముఖ్యనాయకులు
- నామినేషన్లు వేయనున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- కోలాహలంగా మారనున్న నియోజకవర్గ కేంద్రాలు
- చివరి రోజు దాఖలయ్యేది తక్కువే..



చండూరులో నామినేషన్ పత్రం అందజేస్తున్న బీఎస్పీ మునుగోడు అభ్యర్థి శంకరాచారి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలో నామినేషన్ల పర్వం చివరి దశకు చేరింది. ఈ నెల 10న నామినేషన్ల ఘట్టానికి తెరపడనుంది. ఈ నెల 3వ తేదీతో ప్రారంభమైన నామినేషన్ల పర్వం శుక్రవారంతో పూర్తవుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజక వర్గాల పరిధిలో ఇప్పటి వరకు కొద్ది మంది మాత్రమే అధికార, ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేశారు. 9వ తేదీ గురువారం ఏకాదశి కూడా కావడంతో మంచి రోజని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు ఇతర పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు పెద్ద ఎత్తున నామినేషన్ల దాఖలుకు సిద్ధమవుతున్నారు.

ముఖ్య నాయకులంతా నేడే..

అన్ని నియోజకవర్గాల్లో గురువారం బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ, ఫార్వర్డు బ్లాక్, ఇతర పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. నల్లగొండ నియోజక వర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డితో పాటు ఫార్వర్డు బ్లాక్ పార్టీ అభ్యర్థి పిల్లి రామరాజు యాదవ్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. సూర్యాపేట నుంచి అధికార పార్టీ అభ్యర్థి, మంత్రి జగదీష్‌రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నామినేషన్ వేయనున్నారు. నాగార్జునసాగర్ లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్, కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జయవీర్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి కంకణాల నివేదితారెడ్డి గురువారం నామినేషన్లు వేయనున్నారు. కోదాడలో కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి, తుంగతుర్తిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్, బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య, మునుగోడులో బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి నామినేషన్లు వేయనున్నారు. భువనగిరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి నామినేషన్ వేయనుండగా, నకిరేకల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం, బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య కూడా గురువారం నామినేషన్లు వేయనున్నారు. మిర్యాలగూడలో బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నుంచి బత్తుల లక్ష్మారెడ్డి , సీపీఎం నుంచి జూలకంటి రంగారెడ్డి , బీజేపీ నుంచి సాధినేని శ్రీనివాసరావు నామినేషన్ సమర్పించనున్నారు. హుజూర్‌నగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి నామినేషన్ సమర్పించనున్నారు. దేవరకొండ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీజేపీ అభ్యర్థి కేతావత్ లాలునాయక్ నామినేషన్లు వేయనున్నారు. ఆలేరులో బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునిత, కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల ఐలయ్య నామినేషన్లు సమర్పించనున్నారు. ప్రధాన పార్టీ అభ్యర్థులంతా గురువారమే నామినేషన్లు సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. నామినేషన్లు చివరి రోజు శనివారం తక్కువగానే దాఖలు కానున్నాయి.

6వ రోజు

నియోజకవర్గాల వారీగా	దాఖలైన నామినేషన్లు	ఇప్పటి వరకు మొత్తం
నల్లగొండ	9	22
కోదాడ	7	16
సూర్యాపేట	7	19
మునుగోడు	12	25
నాగార్జునసాగర్	5	13
నకిరేకల్	5	16
ఆలేరు	8	15
తుంగతుర్తి	3	07
మిర్యాలగూడ	12	25
భువనగిరి	3	14
హుజూర్‌నగర్	3	07
దేవరకొండ	4	09
మొత్తం	81	188

6వ రోజు 81 నామినేషన్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నామినేషన్ల ప్రక్రియ జోరందుకుంది. 6వ రోజైన బుధవారం 81 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 3న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ మందకొడిగా సాగుతూ వచ్చింది. నామినేషన్లకు ఇక రెండు రోజులే గడువు ఉండటంతో నామినేషన్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. 7వ తేదీన 37 మంది నామినేషన్లు సమర్పించగా 8వ తేదీన 81 మంది నామినేషన్లు వేశారు. 12 నియోజక వర్గాల పరిధిలో ఇప్పటి వరకు 188 మంది నామినేషన్లు సమర్పించారు.

న్యూస్‌రీల్

తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలి



కుంటపల్లి చెక్ పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

మద్దిరాల : పోలీస్ సిబ్బంది తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశించారు. బుధవారం మద్దిరాపోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, పోలీస్ స్టేషన్ మ్యాప్, గ్రామాల హద్దులను పరిశీలించారు.జిల్లా బార్డర్‌లో కుంటపల్లి వద్ద చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఎన్నికల సమయంలో సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలపై మరింత నిఘా ఉంచాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిని, పోలీస్ రికార్డ్స్‌లో రౌడీ షీటర్లుగా ఉన్న వారిని, సస్పెక్ట్‌ను, ట్రబుల్ మాంగర్స్‌ను, షీటర్లుగా ఉన్న వారినందరినీ ముందుస్తుగా బైండోవర్ చేయాలన్నారు. వారికి ఎన్నికల నియమ నిబంధనలు, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. యువత ఆదర్శంగా ఉండి గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట సీఐ బ్రహ్మమురారి, మద్దిరాల, నూతనకల్ ఎస్ఐలు రవీందర్, నరేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు సూర్యాపేటలో క్రీడా పోటీలు

మునగాల: జిల్లా కేంద్రంలోని క్లియో స్పోర్ట్స్ అరేన స్టేడియంలో అండర్-14, 17బాలబాలికలకు షెటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్ పోటీలను ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా స్కూల్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ.ఆజంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14,17 బాలబాలికలకు బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్ పోటీలను శుక్రవారం మిర్యాలగూడలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా అందజేయాలని, ఇంటర్మీడియట్ విద్యనభ్యసించే వారైతే పదవ తరగతి మెమోతో పాటు బోనఫైడ్ సర్టిఫికెట్ అందచేయాల్సి ఉంటుందని, వివరాలకు సెల్ నంబర్ 89692 21234లో సంప్రదించవచ్చని సూచించారు.

తేమ 17శాతం ఉండేలా చూసుకోవాలి



ఆత్మకూర్‌లో రైతులతో మాట్లాడుతున్న రామారావునాయక్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చే రైతులు తేమ 17శాతం ఉండేవిధంగా చూసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ సూచించారు. బుధవారం ఆత్మకూర్‌లోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకొస్తే మద్దతు ధర వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దివ్య, వ్యవసాయ విస్తరణ అధికారి శైలజ, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అరుణ కుమారి

నడిగూడెం : ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి, ఇంటర్మీయట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ హెచ్.అరుణ కుమారి కోరారు. బుధవారం ఆమె స్థానిక బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సంబంధిత ఉపాధ్యాయులు, అధ్యాపకులకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాల ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్స్ ఎం. వసంత, రేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు 1,058 దరఖాస్తులు




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : వికలాంగులు, 80 ఏళ్ల వృద్ధులకు ఫాం- 12డీ ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించగా జిల్లాలో 1,058 మంది దరఖాస్తు చేసుకున్నట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో సుమారుగా 32 వేల మంది వికలాంగులు, వృద్ధులకు పోస్టల్ ఓటుకు దరఖాస్తులు అందజేశామని, హుజూర్‌గర్ నియోజకవర్గం నుంచి 274, కోదాడ 174, సూర్యాపేట 278, తుంగతుర్తి 332 మొత్తం 1,058 మంది ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. కొత్త ఓటరు నమోదు, మార్పులు చేర్పులులకు అందిన దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 10న మొదటి సవరణ సప్లిమెంటరీ జాబితా విడుదల చేస్తామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, యంసీసీ నోడల్ అధికారి సతీష్ కుమార్, ఎక్సైజ్ అధికారిణి అనిత పాల్గొన్నారు.

చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచాం

జిల్లాలో అన్ని చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావుతో కలసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో బ్యాంక్, డిజిటల్ లావాదేవీలపై నిఘా పెంచి వాటి రోజువారీ వివరాలు అందించాలన్నారు. గృహోపకరణలు, వస్త్ర దుకాణాల గోదాముల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 148 కేసులు నమోదు కాగా ఇందులో 134 కేసులకు సంబంధించి రూ. 2,98,21,038 విలువ గల నగదు, బంగారం, వెండి విడుదల చేసినట్లు వివరించారు. ఎక్సైజ్ శాఖ ద్వారా ఇప్పటివరకు 426 కేసులు నమోదు చేసి 215 మందిని అరెస్ట్ చేశామని, 45,970 లీటర్ల మద్యం పట్టుకున్నామని దాని విలువ రూ. 3,14, 29, 448 ఉంటుందని తెలిపారు. కోడ్ ఉల్లంఘనలపై నాలుగు కేసులు నమోదైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత, డీఎఫ్ఓ సతీష్ కుమార్, సీటీఓ యాదగిరి, డీసీఓ శ్రీధర్, ఏఓ సుదర్శన్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన అంధులకు ఓటు హక్కు కల్పించాలి



బ్రెయిలీలిపిలో గల బ్యాలెట్ నమూనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అర్హులైన అంధులకు ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావు ఆదేశించారు. అంధులకు ఓటు హక్కు వినియోగంపై బ్రెయిలీలిపిలో గల బ్యాలెట్ నమూనా పోస్టర్‌ను ఆవిష్కరించి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 2,113 మంది అర్హులైన అంధులు ఉన్నారని ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పించాలన్నారు. వికలాంగుల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాల వద్ద ఇప్పటికే జిల్లాకు 728 వీల్ చైర్స్ వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత పాల్గొన్నారు.

అధిక సాంద్రత పద్ధతిపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త

తిరుమలగిరి : మండల పరిధిలోని నందాపురంలో పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతిపై కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే ఇన్‌చార్జ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ నరేష్ మాట్లాడారు. చీడ, పీడల యాజమాన్యం, సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డి.ఆదర్శ్, మైనిక పాల్గొన్నారు.

యువతకు ఉపాధే లక్ష్యంగా ఇండస్ట్రియల్ హబ్

- మూసీ మురికి నీటి నుంచి ప్రజలకు విముక్తి కల్పించా
- విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి





మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి, పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

సూర్యాపేట: యువతకు ఉపాధే లక్ష్యంగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేస్తానని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి హామీ ఇచ్చారు. సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్ లోగల పార్టీ కార్యాలయంలో కౌన్సిలర్ జ్యోతి కరుణాకర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 35 వ వార్డు చర్చి కాంపౌండ్ కు చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు మూకుమ్మడిగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌లో చేరిన విజయ శేఖర్, రాంబాబు, రాజశేఖర్ లతోపాటు 400 మందికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూర్యాపేటలో అభివృద్ధి ..కారు స్పీడ్ తో దూసుకెళ్తోందని అన్నారు. ఇక్కడిప్రజలకు ధైర్యం బీఆర్‌ఎస్ పార్టీ అని పేర్కొన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు వేసిన ఓటు సూర్యాపేట ప్రజలను మూసీ మురికి నీటి పీడ నుంచి విముక్తి కల్పించి, గోదావరి జలాలను తీసుకొచ్చిందన్నారు. గతంలో ఎమ్మెల్యేని కలవాలంటే నే పెద్ద యజ్ఞం చేసే పరిస్థితులు ఉండేవన్నారు. సూర్యాపేట అభివృద్దే ప్రామాణికంగా పని చేసిన తాను ఆనాడు ప్రజలకు చెప్పకపోయినా మెడికల్ కళాశాలను తెచ్చానన్నారు. ఆనాడు కారు గుర్తుకు వేసిన ఓటు సూర్యాపేట కు బోటు తో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చిందన్నారు. సూర్యాపేటలో వ్యాపారులు ధైర్యంగా బిజినెస్ చేసుకోగలుగుతున్నారంటే దానికి కారణం ఇక్కడి శాంతి భద్రతలు, ఇక్కడ నెలకొని ఉన్న ప్రశాంత వాతావరణమేనని అన్నారు. ప్రస్తుతం సూర్యాపేట కు వచ్చిన షాపింగ్ మాల్సే సూర్యాపేట అభివృద్ధికి గీటురాయి అని పేర్కొన్నారు. ఓటు విలువ చాలా గొప్పదని, మన తలరాతను నిర్ణయించేది మనం వేసే ఓటే అని అన్నారు. మందిని ముంచడానికి కొందరు ఏకమవుతున్నారని మంత్రి ఆరోపించారు. మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు.

యూనిఫామ్ కుట్టు కూలి విడుదల

- 67,426 మంది విద్యార్థుల దుస్తులకు రూ.67.42లక్షలు
- విద్యాశాఖ ఉత్తర్వులు జారీ
- త్వరలో టైలర్ల ఖాతాల్లో జమకానున్న డబ్బులు



హుజూర్‌నగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరంలో ఉచితంగా పంపిణీ చేసిన యూనిఫామ్‌కు సంబంధించి దర్జీ (టైలర్) లకు చెల్లించాల్సిన కుట్టు కూలి డబ్బులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాకు రూ 67,42,600 విడుదలయ్యాయి. దీంతో విద్యార్థులకు యూనిఫామ్ కుట్టు కూలి కోసం ఎదురు చూస్తున్న టైలర్ల నిరీక్షణ ఫలించినట్లయింది. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున యూనిఫామ్ పంపిణీ చేస్తుంది. ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే యూనిఫామ్‌కు సంబంధించిన ముడివస్త్రం జిల్లాకు అక్కడి నుంచి మండలాలకు చేరుకుంది. ఆ తర్వాత అక్కడి నుంచి సంబంధిత పాఠశాలలకు పంపి విద్యార్థుల కొలతల ఆధారంగా పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల నిర్ణయం మేరకు విద్యార్థులకు దుస్తులను కుట్టించారు. పాఠశాలలు ప్రారంభమై దాదాపు అయిదు నెలల తరువాత కుట్టుకూలి డబ్బులను ప్రభుత్వం విడుదల చేసింది.

జిల్లాలోని 67,426 మంది విద్యార్థుల దుస్తుల కోసం..

జిల్లాలో 986 పాఠశాలలు ఉండగా జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు 32 ఉన్నాయి. మిగతా వాటిలో ప్రాథమిక పాఠశాలలు 662, ప్రాథమికోన్నత పాఠశాలలు 72, ఉన్నత పాఠశాలలు 190 ఉన్నాయి. ఇవే కాక అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ 1, ఆశ్రమ పాఠశాలలు 2, మోడల్ స్కూళ్లు 9, కేజీబీవీలు 18 ఉన్నాయి. వీటిలో మొత్తం 67,426 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఒక్కో విద్యార్థికి కుట్టుకూలి కింద రూ. 100 చొప్పున మొత్తం రూ. 67,42,600 విడుదల అయ్యాయి. జిల్లాకు వచ్చిన గ్రాంటును సంబంధిత పాఠశాలల ఖాతాల్లో జమచేసి ఆయా విద్యార్థుల యూనిఫామ్ కుట్టిన దర్జీల ఖాతాల్లో జమ చేయనున్నారు.

దర్జీల బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తాం



"జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టిన దర్జీలకు చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ గ్రాంటును సంబంధిత పాఠశాలల యాజమాన్య కమిటీల బ్యాంక్ ఖాతాల్లో వేస్తాం. పాఠశాలల యాజమాన్య కమిటీల నుంచి సంబంధిత దర్జీల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు.

– యర్రంశెట్టి రాంబాబు, కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి, సూర్యాపేట.

● నామినేషన్ల దాఖలు


నామినేషన్ దాఖలు చేస్తున్న భువనగిరి బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి


దేవరకొండలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బాలు నాయక్


కోదాడలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్


నకిరేకల్‌లో నామినేషన్ వేస్తున్న సీపీఎం అభ్యర్థి బొజ్జ చిన వెంకులు


నల్లగొండలో నామినేషన్ దాఖలు చేస్తున్న సీపీఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి


సూర్యాపేటలో నామినేషన్ వేస్తున్న బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్య

లగ్గానికి కోడ్ పగ్గం!

- వివాహాలకు అడ్డంకిగా ఎన్నికల నియమావళి
- నిబంధనలతో తప్పని ఇబ్బందులు
- నగదు చెల్లింపులపై ఆంక్షలు
- ఫంక్షన్ హాళ్లు, వాహనాల కొరత
- బంగారం, వస్త్రాల కొనుగోళ్లకు అడ్డంకులు



తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎన్నికల కోడ్.. శుభకార్యాలు చేసే వారికి కష్టాలను తెచ్చి పెట్టింది. దీని ప్రభావం ప్రధానంగా పెళ్లిళ్లపై పడు తోంది. నవంబర్ 16వ తేదీ నుంచి వరుసగా శుభ ముహూర్తాలు ఉన్నాయి. వివాహాలకు అన్నీ సిద్ధం చేసుకుం టున్న తరుణంలోనే ఎన్నికల కోడ్ అమ లులోకి రావడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. పెళ్లింటివారు దుస్తులు, బంగారు, వెండి ఆభర ణాలు కొనుగోలుకు, నగదు లావాదే వీలు చెల్లింపులకు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు.

చెక్‌పోస్టుల వద్ద పట్టుకుంటుండడంతో..

ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉండడంతో పోలీసులు ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. రూ.50 వేలకు మించి డబ్బు తీసుకెళ్తే సీజ్ చేస్తున్నారు. సాధారణంగా పెళ్లిళ్లు, శుభకార్యాలకు లిక్విడ్ క్యాష్ అవసరం ఉంటుంది. ఫంక్షన్ హాల్ బుక్ చేయడం, వంట వాళ్లకు, టెం ట్లకు, దుస్తులు, బంగారం కొనుగోళ్ల వంటి వాటికి నగదు అవసరం. ఎంత లేదన్నా రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వెంట తీసుకెళ్లా ల్సి ఉంటుంది. బం గారం సైతం కొను గోలు చేసి తీసుకెళు తుంటారు. అయితే.. డబ్బు తీసుకెళ్లే క్రమంలో పోలీసులకు పట్టు బడుతున్నారు. శుభ కార్యాల కోసం తీసుకెళ్తు న్నామని ఆధారాలు చూపిం చినా పోలీసులు వినిపించుకోవడం లేదు. డబ్బు పట్టుబడితే దాన్ని విడిపించుకోవడం కోసం పోలీస్ స్టేషన్, ఎన్నికల అధికారుల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది.

డిజిటల్ చెల్లింపుల పైనా ఆంక్షలు

డిజిటల్ లావాదేవీలైనా జరుపుదామనుకున్నా సాధ్యం కావడం లేదు. లక్షకు మించి డిజిటల్ లావాదేవీలు జరిపినా ఎన్నికల కోడ్ ఉల్లం ఘన కిందికే వస్తుం దని, వాటిపై కూడా ఎన్నికల అధికారు లు, పోలీసులు డేగ కన్ను వేశారు. ఏ మాత్రం తేడా వచ్చినా నోటీసు లు ఇచ్చి సంజాయిషీలు అడుగుతున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందికి వస్తే కేసులు నమోదు చేస్తున్నారు.

ఫంక్షన్ హాళ్ల కొరత..

ఫంక్షన్ హాళ్లను వివిధ పార్టీల అభ్యర్థులు ప్రచార వేదికలుగా మార్చుకుంటుండటంతో పెళ్లిళ్ల నిర్వహణ ప్రధాన సమస్యగా మార నుంది. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో భాగంగా, అలాగే ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలకు భోజనాలు, రాత్రి పూట బసకు వీటిని ముం దే బుక్ చేసుకుంటున్నారు. టెంట్లు, వంట సామగ్రి కూడా పెళ్లిళ్లకు దొరికే పరిస్థితి లేదు.



వాహనాలు లేవు..



పెళ్లిళ్లలో అతిథులను తీసుకెళ్లడా నికి వాహనాలు అవసరం. సొం త వాహనాలు ఉన్న వారికి పెద్ద సమస్య ఉండక పోవచ్చు. కానీ అవి లేని వారి పరిస్థితి ఇబ్బందికరంగా మారిం ది. పెళ్లి కోసం కార్లు, బస్సులు దొరకడం లేదు. ఎన్నికల షెడ్యూల్ జారీ అయిన మరుసటి రోజే అభ్యర్థులు వీటిని బుక్ చేసుకు న్నారు. ఎన్నికల ప్రచారంలో వాడుకోవడానికి ఒక్కో అభ్య ర్థి అధికారికంగా మూడు, నాలుగు, అనధికారికంగా 10, 15 వాహనాలను బుక్ చేసు కున్నారు. దీంతో పెళ్లిళ్లకు వాహనాలు దొరకని పరిస్థితి ఏర్పడింది.

జంగ్ తెలంగాణ

పోలింగ్ ప్రక్రియలో పలు మార్పులు



మిర్యాలగూడ అర్బన్ : ఎన్నికల సంఘం ఈ సారి పోలింగ్‌లో స్వల్ప మార్పులు చేసింది. ఆ మార్పులను ఓటర్లు తప్పకుం డా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

- ఓటు వేయలేని పరిస్థితు ల్లో ఉన్న వారికి సహాయకు డిగా గతంలో 18 ఏళ్ల లోపు వారిని కూడా అనుమతించేవారు. కానీ వారికి ఇంకు పెట్టేవారు కాదు. ఈసారి మాత్రం ఓటరు సహాయకుడు అదే బూత్ ఓటరై ఉండాలి. తను ఓటు వేసిన తర్వాతే మరొకరికి సహాయకుడిగా వెళ్లాలి. ఓటు వేసేటప్పుడు ఎడమ చేయి చూపుడు వేలుకు ఇంకు పెడతారు. ఓటరుకు సహాయకుడిగా వెళ్లినప్పుడు కుడి చేయి చూపుడు వేలుకు ఇంకు పెడతారు. ఒక్కరికి మాత్రమే సహాయకుడిగా వెళ్లే అవకాశం ఉంటుంది.
- గతంలో మాక్ పోలింగ్‌ను అరగంట ముందుగా ఏజెంట్ల సమక్షంలోనే నిర్వహించేవారు. ఈ సారి దాన్ని 90 నిమిషాల ముం దు నిర్వహించను న్నారు. అంటే ఉదయం 5.30 గం టలకు మాక్ పోలింగ్ ప్రారంభిస్తారు. ఏజెంట్లు రాకపోతే 15 నిమిషాలు వేచి చూస్తారు. అప్పటికీ రాకుంటే బూత్‌లో అందుబాటులో ఉన్న అధికారులే మాక్ పోలింగ్ నిర్వహిస్తారు.
- బూత్ ఓటరే పోలింగ్ కేంద్రంలో అభ్యర్థి తరఫున ఏజెంటుగా ఉండాలన్న నిబంధన గతంలో ఉండే ది. తాజా నిబంధన ప్రకారం ఆ నియోజకవర్గం లోని ఎక్కడి ఓటరైనా ఏజెంటుగా ఉండవచ్చు.
- గతంలో పోలింగ్ ఏజెంట్లుగా ప్రజా ప్రతినిధు లను అనుమతించేవారు కాదు. ఈ సారి సర్పం చ్, వార్డు సభ్యులు కూడా ఏజెంట్లుగా కూర్చునే అవకాశం ఉంది.

● అమ్మ ఆశీర్వాదం


నామినేషన్ వేయడానికి ముందు బుధవారం తన తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ భువనగిరి అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

'కమలం' పోయి 'కారు' వచ్చే.. కారు పోయి చేయి వచ్చే..

చిట్యాల : ఈ ఎన్నికల్లో వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రచారం జోరుగా సాగుతోంది. రాజకీయ పార్టీల సమాచారాన్ని, ఎన్నికల ప్రచారాన్ని ఆయా పార్టీల ప్రతినిధులు, నాయకులు సోషల్ మీడియా ద్వారా చేరవే స్తున్నారు. కాగా నిన్నటి వరకు ఓ పార్టీ తరఫున రన్ చేసిన వాట్సాప్ గ్రూపునకు చెందిన ఆ పార్టీ పెద్ద నాయకుడు రాత్రికి రాత్రే పార్టీ మారడంతో ఆకస్మాత్తుగా ఆ వాట్సాప్ గ్రూపు పేరు మార్చడంతో పాటు ఆ మారిన పార్టీ ప్రచారాన్ని చేస్తున్నారు. దీంతో ఆ వాట్సప్ గ్రూపులో నిన్నటి వరకు బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేయాలని చేసిన ప్రచారాన్ని మాను కుని.. కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తుకు ఓటు వేయమని చెబుతున్నారు. మరో గ్రూప్‌లో బీజేపీ కమలం గుర్తుకు ఓటు వేయమని చేసిన ప్రచారం మానుకుని బీఆర్ఎస్ కారు గుర్తుకు వేయాలని కోరుతున్నారు. వీటిని గమ నిస్తున్న ఆయా వాట్సాప్ గ్రూప్‌లలో ఉన్న సామా న్యులు అవాక్కవుతున్నారు.

నాలుగోసారి నామినేషన్


నామినేషన్ వేస్తున్న కొంగరి మల్లయ్య

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెం గ్రామానికి చెందిన కొంగరి మల్లయ్య తుం గతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్య ర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. తుంగతుర్తి నుంచి గతంలో రెండు పర్యాయాలు మల్లయ్య నామినే షన్లు దాఖలు చేశారు. రద్దయిన రామన్నపేట నియోజక వర్గంలో కూడా ఒకసారి నామినేషన్ వేశారు. ఈ సంద ర్భంగా మల్లయ్య మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ విధానం ద్వారా ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవు తాయన్నారు. భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్య తా కేంద్రం (యూసీసీఆర్ఐఎంఎల్) మద్దతుతో తాను నామినేషన్ వేసినట్లు చెప్పారు.

మొన్న బీఆర్ఎస్.. నిన్న కాంగ్రెస్

యాదగిరిగుట్ట : ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆయా రాజకీయ పార్టీలు పడరాని పాట్లు పడుతున్నాయి. నాయకులను చేర్చుకోవడంలో పార్టీలు పోటీ పడుతున్నాయి. దీంతో కొందరు ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి గంటల వ్యవధిలోనే కండువాలు మారుస్తున్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు మురళి మంగళవారం గొంగిడి మహేందర్‌రెడ్డి, కల్లూరి రామచంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ ఎస్‌లో చేరారు. తిరిగి బుధవారం ఆ వ్యక్తే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల ఐలయ్య సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.


మంగళవారం మురళిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న గొంగిడి మహేందర్‌రెడ్డి


బుధవారం కాంగ్రెస్‌లో చేరుతున్న మురళి


గవర్నర్ తమిళిసై చేతులమీదుగా గోల్డ్ మెడల్ అందుకున్న తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి సెల్ఫీ దిగుతున్న విద్యార్థిని

ఉత్సాహంగా ఎంజీయూ స్నాతకోత్సవం

నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన 3వ స్నాతకోత్సవానికి యూనివర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమెతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ రామచంద్రం, ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి కలిసి పీహెచ్‌డీ పూర్తిచేసిన వారికి డాక్టరేట్ పట్టాలు, యూనివర్సిటీలోని ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు.

డాక్టరేట్ అందుకున్న వారు


బి. నర్సింహారెడ్డి, మ్యాథమెటిక్స్ | కె. అరుణకుమారి, కెమిస్ట్రీ | పొన్న శ్రీలత, కామర్స్


దేవరకొండ పవన్‌కుమార్, బిజినెస్ మేనేజ్‌మెంట్ | కాసోజు రవిచంద్ర, కామర్స్ | సందబోయిన శివకుమార్, కామర్స్ | ఎం. జాన్‌పాల్, బిజినెస్ మేనేజ్‌మెంట్ | కె. రామలింగం, కెమిస్ట్రీ | చెనగోని వెంకటేశ్వర్లు, మ్యాథమెటిక్స్ | ఉడారి బాలరాజు, కెమిస్ట్రీ | నల్లపు కిరణ్‌కుమార్, మ్యాథమెటిక్స్ | ఎస్. యాదయ్య, కెమిస్ట్రీ


డి. సంతోష్‌కుమార్, బిజినెస్ మేనేజ్‌మెంట్ | కట్టా కిరణ్మయి, బిజినెస్ మేనేజ్‌మెంట్ | రామలింగేశ్వరప్రసాద్, బిజినెస్ మేనేజ్‌మెంట్

గోల్డ్ మెడల్ అందుకున్న వారు


షాహేదా, ఎంఏ ఇంగ్లిష్ | నడికట్ల అవినాష్, ఎంఏ ఎకనామిక్స్ | ధూమల సతీష్, ఎంకాం | షేక్ తహసిన్, ఎంఎస్సీ మ్యాథ్స్, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ | తేలుకుంట్ల సాయిప్రియ, ఎంఎస్సీ కెమిస్ట్రీ | అలిపెద్ది రవితేజారెడ్డి, ఎంఎస్సీ బయో టెక్నాలజీ | మోర జ్యోత్స్న, ఎంబీఏ ఫైనాన్స్ | చిరుమర్రి జయశ్రీ, ఎంసీఏ


ఆదెపు మహేశ్వరి, ఎంఏ ఇంగ్లిష్ | గంట్ల గీత, ఎంఏ ఎకనామిక్స్ | ఆయేషా రుమాన్, ఎంకాం | తిరుకచ్చి సువర్ణ, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ | డి. యోగానందచారి, ఎంఎస్సీ కెమిస్ట్రీ | రెడ్డిమల్ల నరేష్, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ | ఎ. జానప్రియసోని, ఎంఎస్సీ బయో టెక్నాలజీ | చిన్నాల జ్యోతి, ఎంబీఏ ఫైనాన్స్ | యాకలపు నవీన్‌కుమార్, ఎంసీఏ


ఇదునూరి హేమలత, బీకాం | జిన్నె దీప, ఎంఏ ఇంగ్లిష్ | కోడూరి సాయికుమార్, ఎంఏ ఎకనామిక్స్ | పదారు శ్వేత, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ | కంద్లకుంట్ల భార్గవి, ఎంఎస్సీ బయో టెక్నాలజీ | పెద్దకొట్ల దివ్య, ఎంబీఏ ఫైనాన్స్ | వి. వెంకట శ్రావణి, ఎంసీఏ | సమీరా, బీకాం | అజీబున్నీసా బేగం, ఎంఏ ఇంగ్లిష్


చెన్నూ శ్రీకావ్య, ఎంఏ ఎకనామిక్స్ | దుస్సా సుస్మిత, ఎంకాం | కమిని సాయిప్రగతి, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ | పి. ప్రత్యూష, ఎంఎస్సీ కెమిస్ట్రీ | విజల సంతోష్‌కుమార్, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ | నీతు వేణుగోపాల్ పిళ్లై, ఎంఎస్సీ బయో టెక్నాలజీ | దుర్శ మౌనిక, ఎంఎస్సీ ఐపీసీ | బొమ్ము వరలక్ష్మి, ఎంబీఏ ఫైనాన్స్ | యామాల సౌజన్య, బీకాం

సాక్షి క్లాసిఫైడ్స్

Services

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేకోవర్ అగ్రి కల్చర్ ఏజెంట్ DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు ఖర్చులు. 9990752820. [T-203]

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-1220944]

BUSINESS OFFER

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 6309563491 [H-193277]

Wanted

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-801043]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం: 18K Ph: 9848571888/9640400073 [H-189348]

■ రామకృష్ణ గ్రూపు, (TS No.1) HYD, VJA, శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. TS & AP అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52838, 82474 49036. [B-1206468]

ప్రకటన కొంచెం! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లలో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి తదుపరి ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.